## నేడు 'డయల్' యువర్ డీఎం

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 27 : వరంగల్-1 డిపోలో గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎం వంగల మోహన్ రావు తెలిపారు. హైదరాబాద్, నిజామాబాద్, సిద్దిపేట, పాలకుర్తి, తరిగొప్పుల రూట్ల ప్రయాణికులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ సలహాలు, సూచనలు తెలియజేయాలని, ఆయా రూట్లలో ఏమైనా సమస్యలు ఉంటే ఉదయం 11 నుంచి 12 గంటల వరకు 99592 26047 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

## ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం

సుబేదారి, నవంబర్ 27 : మానవహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బదావత్ రాజును పోలీసులు ఈ నెల 25న అర్ధరాత్రి ఇంటి నుంచి తీసుకువచ్చి కేయూ పోలీసు స్టేషన్‌లో నిర్బంధించడంపై హనవహక్కుల వేదిక తీవ్రంగా ఖండించింది. లగచర్ల ఘటనపై బంజారా హక్కుల పోరాట సమితి నిరసనలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో రాజును పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకొని నిర్బంధించడం చట్టవ్యతిరేకమని వేదిక రాష్ట్ర నాయకులు భుజంగరావు, తిరుపతయ్య, జీవన్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పౌరుల హక్కులకు భంగం కలిగిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందస్తు అరెస్టులను రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు మానుకోవాలని డిమాండ్ చేశారు.

## మహిళ అదృశ్యం

కవిత(ఫైల్)

ధర్మసాగర్, నవంబర్ 27 : ఎల్కతుర్తి మండలం పెంచికల్‌పేట గ్రామానికి చెందిన జన్ను కవిత-శ్రీనివాస్ దంపతుల కుమార్తె ధర్మసాగర్ కేజీబీవీ చదువుతున్నది. కాగా, ఈ నెల 24న కవిత తన కూతురును చూసేందుకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. భార్య ఇంటికి రాకపోవడంతో బుధవారం కేజీబీవీలో చదువుతున్న తన కూతురు వద్దకు వచ్చి శ్రీనివాస్ ఆరా తీశాడు. ఆచూకీ తెలియకపోవడంతో ఆమె కుమారుడు జన్ను నిరంజన్ ధర్మసాగర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బాబా తెలిపారు.

**మహారాజశ్రీ గౌరవ మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్ జిల్లా ప్రధాన జడ్జి వారి కోర్టు, హనుమకొండ.**
**MVOP No. 570/2022**
**బిట్వీన్:**
1) అనిశెట్టి విజయ @ విజయలక్ష్మి
2) అనిశెట్టి రాశి ...క్లెయిమ్ పిటీషనర్స్
**మరియు**
1) దారావత్ రాజు మరియు మరొకరు ...రెస్పాండెంట్స్
**నోటీసు**
**R1:** దారావత్ రాజు, తండ్రి: హరియ, Age: మేజర్, వృత్తి: డ్రైవర్ ఆఫ్ ది క్రైం వెహికల్, నివాసం: సుందరయ్య నగర్, గుండ్లసింగారం, హనుమకొండ సిటీ & జిల్లా.
పైన తెలిపిన క్లెయిమ్ పిటీషనర్స్, రెస్పాండెంట్ నెం. 1 & 2 అయిన మీపై మోటార్ వాహన ప్రమాద నష్టపరిహారం కొరకు పైన తెలిపిన కోర్టు వారి నందు దావా దాఖలు పరచినారు. ఇట్టి దావాలో మీ హాజరు కొరకు 20/12/2024న వాయిదా ఉన్నది. ఆరోజున మీరు స్వయంగా గాని లేక న్యాయవాది ద్వారా గాని పైన తెలిపిన కోర్టువారి ఎదుట తేది: 20/12/2024న ఉ|| 10.30 గంటలకు హాజరు కాగలరు. లేనియెడల, కేసు మీ పరోక్షమందు తీర్మానించబడును.
// కోర్టు వారి అనుమతితో //
**G.రవీందరరావు, J.నర్సింగరావు,**
న్యాయవాదులు, హనుమకొండ.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
సెప్టిక్ ట్యాంక్ క్లినర్
SepTeK
★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-326503

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

వేలేరు : మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

హసన్‌పర్తి : మాట్లాడుతున్న మండలాధ్యక్షుడు రజినీకుమార్

# అటకెక్కిన కాంగ్రెస్ హామీలు

- దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- మాజీ ఎమ్మెల్యే రాజయ్య

వేలేరు/ధర్మసాగర్, నవంబర్ 27 : కాంగ్రెస్ అమలు చేస్తానన్న ఆరు గ్యారెంటీలు అటకెక్కాయని స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య విమర్శించారు. బుధవారం వేలేరు, ధర్మసాగర్ మండల కేంద్రాల్లో జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. డిసెంబర్ 1 నుంచి 9వరకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నవి ప్రజాపాలన విజయోత్సవాలు కాదని ప్రజలను వంచించిన ఉత్సవాలుగా అభివర్ణించారు. కాంగ్రెస్ ఇచ్చిన మోసపూరిత హామీలను ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ రాక్షస పాలన సాగిస్తున్నదని విమర్శించారు. పది సంవత్సరాలు తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ అన్నీ రంగాల్లో సుభిక్షంగా ఉంచారన్నారు. వ్యవసాయ రంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కుదేలు చేస్తున్నదని, రైతులకు ఇచ్చిన ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. పార్టీ అధ్యర్యంలో నిర్వహించే దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కార్యకర్తలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఆనంతరం పీచర గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మహిళా నాయకురాలు పూలక్క అనారోగ్యంతో బాధపడుతుండగా ఆమెను పలకరించి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ చాడ సరితారెడ్డి, వేలేరు మండల ఇన్‌చార్జి ఇట్టబోయిన భూపతిరాజ్, నియోజకవర్గ కో ఆర్డినేటర్ మరిజె నర్సింహారావు, మాజీ వైస్ ఎంపీపీ సంపత్, సర్పంచ్‌ల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు మాధవరెడ్డి, మండల కో ఆర్డినేటర్ రాజు, నియోజకవర్గ ఎస్సీ కో ఆర్డినేటర్ కొయ్యడ మహేందర్, నాయకులు బొడ్డు ప్రభుదాస్, కర్ర సోమిరెడ్డి, జానీ, కిరణ్, బత్తుల శ్రీనివాస్, పోలు తిరుపతి, సుధాకర్, లాల్ బాలరాజు, విజయ్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

**విజయవంతం చేయాలి**

హసన్‌పర్తి : హనుమకొండలో ఈ నెల 29న జరిగే దీక్షా దివస్‌ను విజవంతం చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బండి రజినీకుమార్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. కేసీఆర్ చేసిన ఆమరణ నిరాహార దీక్ష ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందన్నారు. కార్యక్రమంలో 66వ డివిజన్ అధ్యక్షుడు పాపిశెట్టి శ్రీధర్, ప్యాక్స్ వైస్ చైర్మన్ పాడి మల్లారెడ్డి, నాయకులు రవీందర్, విజేందర్, వాసుదేవరెడ్డి, రాజేందర్, వేణుగోపాల్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌తో బీఆర్ఎస్వీ నాయకులు

## కేటీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్వీ నాయకులు

హనుమకొండ, నవంబర్ 27 : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కేయూ బీఆర్ఎస్వీ విద్యార్థి సంఘం నాయకులు హైదరాబాద్ నందినగర్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. భవిష్యత్ కార్యాచరణపై చర్చించినట్లు నాయకులు తెలిపారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో మాచర్ల శరత్‌చంద్ర, కంజర్ల మనోజ్‌కుమార్, బైరపాక ప్రశాంత్, అరూరి రంజిత్, కలకోట్ల సుమన్, అర్షం మధుకర్, రాకేశ్, కల్యాణ్, వినయ్ ఉన్నారు.

భీమదేవరపల్లి : ముల్కనూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డీఎంహెచ్‌వో తనిఖీ

భీమదేవరపల్లి/నడికూడ, నవంబర్ 27 : ముల్కనూరు, నడికూడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను బుధవారం డీఎంహెచ్‌వో అప్పయ్య తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో కావాల్సిన సదుపాయాలపై వైద్యాధికారి ప్రదీప్‌ను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, సమయపాలన పాటించాలని, సిబ్బంది విధులలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించనున్నట్లు తెలిపారు. ముల్కనూరు పక్కనే ఉన్న కొత్తపల్లి గ్రామం వంగర ప్రభుత్వాస్పత్రి పరిధిలో ఉందని, వెంటనే ముల్కనూరు పరిధిలోకి తీసుకురావాలని స్థానికులు, వైద్యసిబ్బంది కోరగా సుముఖత వ్యక్తం చేశారు. అంతకుముందు కొత్తకొండలోని పల్లె దవాఖానను సందర్శించారు. వైద్యాధికారులు మౌనిక, డాక్టర్ అనూహ్య, సరిత, సిబ్బంది మల్లీశ్వరి, రాజయ్య, రత్నభారతి, రాజేందర్ పాల్గొన్నారు.

# పూడికతీత పనుల్లో వేగం పెంచాలి

- భద్రకాళీ చెరువును పరిశీలించిన కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద

భద్రకాళీ చెరువు పూడికతీత పనులను పరిశీలిస్తున్న కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద

వరంగల్, నవంబర్ 27 : భద్రకాళీ చెరువు పూడికతీత పనులను వేగవంతం చేయాలని కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద అన్నారు. బుధవారం కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి భద్రకాళీ చెరువు పూడికతీత పనులను పరిశీలించారు. పూడికతీత పనులకు సంబంధించిన వివరాలను నీటిపారుదల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇరిగేషన్, రెవెన్యూ, కుడా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చెరువు పూడికతీత పనులపై సర్వే చేసి ఏ పనికి ఎంత ఖర్చు అవుతుందనే దానిపై వాస్తవ అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. పూడిక మట్టిని డంపింగ్ చేసేందుకు స్థలాలను గుర్తించాలని ఆర్డీవోలను ఆదేశించారు. చెరువు మట్టి కావాలని దరఖాస్తు చేసుకున్న వారితో సమావేశం నిర్వహించాలన్నారు. 3 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తీసేందుకు కుడా అధికారులు తయారు చేసిన ప్రణాళికలకు కలెక్టర్లు ఆమోదం తెలిపారు. ఆర్డీవోలు రాథోడ్ రమేశ్, సత్యపాల్ రెడ్డి, నీటి పారుదల శాఖ సీఈ అశోక్‌కుమార్, ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఈఈ సీతారాం, కుడా పీవో అజిత్‌రెడ్డి, ఈఈ భీమ్‌రావు పాల్గొన్నారు.

## మహిళా లెక్చరర్‌కు లైంగిక వేధింపులు

- గతంలోనూ అధ్యాపకుడిపై ఆరోపణలు
- హనుమకొండ ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కాలేజీలో ఘటన

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 27 : హనుమకొండ ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కాలేజీలో తోటి అధ్యాపకుడు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడని ఆరోపిస్తూ మహిళా అధ్యాపకురాలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. ఇదిలా ఉండగా సదరు లెక్చరర్ కొద్దిరోజుల క్రితం ఓ మహిళా సబార్డినేటర్‌తోనూ అసభ్యంగా ప్రవర్తించగా కాలేజీ ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసిందని తెలుస్తోంది. అప్పుడు సదరు అధ్యాపకుడికి అధికారులు మెమో జారీ చేశారు. అయితే బాధిత మహిళా ఉద్యోగిపై ఒత్తిడి తీసుకువచ్చి ఫిర్యాదును వాపస్ తీసుకునేలా చేసినట్లు సమాచారం. ఈ ఘటనను కూడా కాలేజీ అధికారులు ధ్రువీకరిస్తున్నారు. తాజాగా తనపై వేధింపులకు పాల్పడుతున్నట్లు మహిళా అధ్యాపకురాలు ఇంటర్మీడియెట్ బోర్డు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తున్నది.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 26మందికి జరిమానా

సుబేదారి, నవంబర్ 27 : హనుమకొండ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో బుధవారం డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 26మందికి రూ.32,500 జరిమానా, మేకల తండాకు చెందిన లావుడ్యా తిరుపతికి రెండు రోజుల కమ్యూనిటీ సర్వీస్ శిక్ష విధించిట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీతారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన ముగ్గురికి జరిమానా విధించినట్లు చెప్పారు.

## పక్షుల వేటగాళ్లకు కౌన్సిలింగ్

శాయంపేట నవంబర్ 27 : పత్తిపాక గుట్టల పరిసరాల్లో పక్షుల వేటగాళ్లను అడ్డుకొని వారికి వైల్డ్ లైఫ్ జిల్లా బాధ్యుడు సునీల్ బుధవారం కౌన్సెలింగ్ ఇచ్చాడు. ఆత్మకూరు మండలం కటాక్షపూర్‌కు చెందిన ముగ్గురు వేటగాళ్లు పత్తిపాక గుట్టల పరిసరాల్లో పక్షులను వేటాడేందుకు వెళ్తుండగా, సునీల్ వారిని అడ్డుకున్నాడు. మరోసారి వేటాడినట్లు తేలితే ముగ్గురికి జైలు శిక్ష పడడం ఖాయమని హెచ్చరించాడు. విషయాన్ని అటవీశాఖ అధికారులకు తెలిపినట్లు సునీల్ చెప్పాడు.

కాజీపేటలో రైల్వే మజ్దూర్ యూనియన్ జోనల్ ప్రధాన కార్యదర్శి శంకర్‌రావును సన్మానిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

## యూనియన్‌కు బీఆర్ఎస్ మద్దతు అభినందనీయం

కాజీపేట, నవంబర్ 27 : రైల్వేలో త్వరలో జరుగనున్న వన్ యూనియన్, వన్ ఇండస్ట్రీ గుర్తింపు ఎన్నికల్లో దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్‌కు బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించడం అభినందనీయమని యూనియన్ జోనల్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ శంకర్‌రావు అన్నారు. రైల్వేలో డిసెంబర్ 4, 5, 6 తేదీల్లో జరుగనున్న రైల్వే గుర్తింపు ఎన్నికల సందర్భంగా కాజీపేట రైల్వే ఈఎల్ఎస్, డీఎల్ఎస్ షెడ్లలో ప్రచారం చేసేందుకు వచ్చిన శంకర్‌రావును బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ ఆదేశానుసారం కార్పొరేటర్ సంకు నర్సింగరావు ఆధ్వర్యంలో నాయకులు కలిసి సన్మానించారు. కాజీపేట రైల్వే స్టేషన్‌కు అభివృద్ధి చేసేందుకు, కొత్త పరిశ్రమలు రప్పించి, ఈ ప్రాంత నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు పాటుపడుతానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నార్లగిరి రమేశ్, గబ్బెట శ్రీనివాస్, ఎండీ హుస్సేన్, దువ్వ కనుకరాజు, అఫ్జల్, శంకర్, నరేశ్, యాకూబ్ పాల్గొన్నారు.

# సర్వే సమాచారం పక్కాగా నమోదు చేయాలి

**బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే**


సమగ్ర కుల సర్వే సమాచార నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్, నవంబర్ 27 : ఇంటింటి సమగ్ర, కుల సర్వేలో సేకరించిన సమాచారాన్ని పక్కాగా నమోదు చేయాలని గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. బుధవారం కార్పొరేషన్ ఆవరణలోని మెప్మా భవన్‌లో జరుగుతున్న సర్వే సమాచార నమోదు ప్రక్రియను పరిశీలించారు. పొరపాట్లకు ఆస్కారం లేకుండా ఎన్యుమరేటర్లు, ఆపరేటర్లు నమోదు చేయాలన్నారు. నమోదు ప్రక్రియను అదనపు కమిషనర్, డిప్యూటీ కమిషనర్లు, పన్నుల అధికారి, సూపర్‌వైజర్లు పర్యవేక్షణ చేయాలన్నారు. ఒక్క సర్వే రిపోర్టు నమోదు చేయడానికి 10 నిముషాలు పడుతున్న నేపథ్యంలో నెట్ వర్క్ సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదనపు కమిషనర్ జోనా, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, పన్నుల అధికారి బిర్రు శ్రీనివాస్, ఆర్వో షహజాదీ బేగం, టీఎంసీ రమేశ్, ఐటీ మేనేజర్ రమేశ్ పాల్గొన్నారు.

కేజీబీవీలో నల్ల బ్యాడ్జీలు ధరించి, నిరసన తెలుపుతున్న మహిళా ఉపాధ్యాయులు

## మినిమం టైం స్కేల్ మంజూరు చేయాలి

ఆత్మకూరు, నవంబర్ 27 : కేజీవీబీల్లో పని చేస్తున్న మహిళా ఉపాధ్యాయులు, నాన్‌టీచింగ్ సిబ్బందికి మినిమం టైం స్కేల్ మంజూరు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు డిమాండ్ చేశారు. బుధవారం ఆత్మకూరు కేజీబీవీలో భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కేజీవీబీ సిబ్బందికి హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, నైట్ వాచ్‌మెన్లు, కేర్ టేకర్లను నియమించాలని, మహిళా ఉపాధ్యాయులను బోధనేతర పనులకు వినియోగించుకోవద్దన్నారు. మహిళా ఉపాధ్యాయులకు చైల్డ్ కేర్ లీవులు మంజూరు చేయాలన్నారు.

## 15 రోజులైనా కాంటాలు పెట్టరా?

ఐనవోలు, నవంబర్ 27 : కొండపర్తి ఐకేపీ కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెచ్చి 15 రోజులైనా కాంటాలు ఎందుకు పెట్టడం లేదని అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి ప్రశ్నించారు. కొండపర్తి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ప్రభుత్వం సూచించిన తేమ శాతంలోపు ఉన్నా కాంటాలు పెట్టడం లేదని, క్వింటాకు 5 కిలోల కోత పెడుతున్నారన్నారు. రైతులకు సరైన టైంలో గన్నీ బ్యాగులు ఇవ్వడం లేదని, కాంటా వేసిన తర్వాత మళ్లీ మిల్లర్లు కోతలు పెట్టి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి లింగయ్య, మడిగె నాగరాజు ఉన్నారు.

ఐనవోలు : కొండపర్తి ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న సారంపల్లి మల్లారెడ్డి

మాట్లాడుతున్న జిల్లా సంక్షేమాధికారి జయంతి

## మహిళలపై జరుగుతున్న హింసను సహించొద్దు

హనుమకొండ, నవంబర్ 27 : మహిళలపై జరుగుతున్న హింసను సహించొద్దని జిల్లా సంక్షేమ అధికారి జయంతి అన్నారు. బుధవారం హనుమకొండలోని సఖీ సెంటర్‌లో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గ్రామ స్థాయి మహిళా సహాయ కమిటీలకు ఏర్పాటు చేసిన క్షేత్ర సందర్శనలో పాల్గొని మాట్లాడారు. మహిళలు సమస్యలను ఎదుర్కొనేలా గ్రామ కమిటీ సభ్యులు సహాయ సహకారాలు అందించాలని సూచించారు. మహిళలకు సహకరించే వ్యవస్థలపై అవగాహన ఉన్నప్పుడే పరిష్కారం సాధ్యమని సర్వోదయ సంస్థ కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు. కార్యక్రమంలో విమెన్ హబ్ కో ఆర్డినేటర్ కల్యాణి, సఖీ సెంటర్ లీగల కౌన్సిలర్ శ్రీదేవి, డీవీ కౌన్సిలర్ పావని, సర్వోదయ ప్రాజెక్ట్ మేనేజర్ కవిరాజ్, ఇందిర, రవీందర్, అక్తర్, శ్రీలత పాల్గొన్నారు.

## ప్రజల ఆకాంక్షలు నెరవేర్చితేనే ప్రభుత్వాలకు మనుగడ

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 27 : ప్రజల ఆకాంక్షలు నెరవేర్చితేనే ప్రభుత్వాలకు మనగడ ఉంటుందని, ప్రజలకిచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేసినప్పుడే అభివృద్ధి సాధ్యమని, తద్వారా దేశం, రాష్ట్రంలో సుస్థిరపాలన నెలకొంటుందని ఉస్మానియా యూనివర్సిటీ సోషల్ సైన్స్ రిటైర్డ్ ప్రొఫెసర్ శ్రీనివాసులు అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయ సెనెట్ హాల్‌లో రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షలు, వాగ్దానాలు రాజకీయ పనితీరు' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాసులు మాట్లాడుతూ.. అణగారిన ప్రజలను జీవితాంతం ఆర్థికంగా, ఆత్మ గౌరవంతో జీవించేలా చేసేవే నిజమైన సంక్షేమ పథకాలని, కులం, మతం-ఓట్లు, సీట్లు అధికార ప్రయోజనాలే ధ్యేయంగా ప్రభుత్వాలు పథకాలు తెస్తే పాలకులే సమాజాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టినట్టవుతుందని పేర్కొన్నారు. ఓయూ చరిత్ర విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ సత్యనారాయణ, హరిప్రసాద్, మనోహర్, మల్లికార్జునరెడ్డి, రామచంద్రం ప్రసంగించారు. అనంతరం విద్యార్థులు, ప్యానల్ స్పీకర్లకు మధ్య చర్చ కొనసాగింది. రాజనీతిశాస్త్ర విభాగం అధ్యాపకుడు, బీవోఎస్ చైర్మన్ గడ్డం కృష్ణయ్య, సత్యనారాయణ, నాగరాజు, లలితకుమారి, విజయ్, లక్ష్మీనారాయణ, సంజీవ్ పాల్గొన్నారు.


వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి

## నిట్‌లో వర్క్‌షాప్ ప్రారంభం

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 27 : నిట్‌లోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి డిసెంబర్ 1 వరకు 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ సాఫ్ట్‌వేర్ టెస్టింగ్'పై ఐదు రోజుల వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి, డీఆర్‌డీఎల్ హైదరాబాద్ ఐటీ టెక్నాలజీ డైరెక్టర్ సౌమెన్ కుమార్‌రాయ్ ప్రారంభించారు. ఈ సంవత్సరం వర్క్‌షాప్ థీమ్ ఫైనాన్సియల్ సెక్యూరిటీ అని, ఐదు రోజులు జరిగే ఈ వర్క్‌షాప్‌లో దేశంలోని 40 మంది ఫ్యాకల్టీ, రీసెర్చ్ స్కాలర్లు పాల్గొంటారని చెప్పారు. ప్రొఫెసర్ సంఘరత్న గాడ్ బోలే, నిట్ ప్రొఫెసర్ సంజయకుమార్ పాండా, రూర్కెలా ఎన్ఐటీకి చెందిన ప్రొఫెసర్ దుర్గాప్రసాద్ సమన్వయకర్తలుగా వ్యవహరిస్తున్నారు.

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ఐనవోలు, నవంబర్ 27 : మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో తెలంగాణ సమగ్ర శిక్ష ఆదేశాల మేరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు పునరుత్పాదక ఇంధన వనరులు అనే అంశం పైన వ్యాసన రచన పోటీలు నిర్వహించినట్లు ఎంఈవో పులి ఆనందం తెలిపారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులు పీ వర్ష (పంథిని జడ్పీ పాఠశాల), జీ శరణ్య (కేజీబీవీ)ని జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీలకు పంపించనున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం వెంకటేశ్వర్‌రావు, జిల్లా స్థాయి పోటీల ఆర్గనైజర్ అలిగిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయులు సమ్మయ్య, అశోక్‌కుమార్, సరళ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

ఎల్కతుర్తి : మోడల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో వాసంతి

ఐనవోలు/దామెర/శాయంపేట, నవంబర్ 27 : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆర్డీవో రమేశ్ రథోడ్ అన్నారు. బుధవారం మండలంలోని కేజీబీవీ హాస్టల్‌ను తహసీల్దార్ విక్రమ్‌కుమార్‌తో కలిసి తనిఖీ చేశారు. అంతకుముందు ఐనవోలు మల్లికార్జునస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. కేజీబీవీలో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ గురించి విద్యార్థులను ఆరా తీశారు. కిచెన్ గదులు, కూరగాయలు, వంట సరుకుల స్టోర్ రూమ్‌ను తనిఖీ చేశారు. విద్యార్థులకు తాజా కూరగాయలు, ఆకుకూరలతో భోజనం వడ్డించాలన్నారు. మెనూ బోర్డులను అందరికి కనిపించేలా ఏర్పాటు చేయాలని సూచించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థుల తో మాట్లాడారు. ఎంపీడీవో వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దార్ అనిల్‌కుమార్ ఉన్నారు. దామెర మండలంలోని ల్యాదెళ్ల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి బుధవారం సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. అలాగె మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో బాల్యవివాహాల సదస్సుకు హాజరై మాట్లాడారు. పిల్లలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ సంపత్, డాక్టర్ మంజుల, ఎన్‌జీవోబీ జ్ఞానేశ్వరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణి పాల్గొన్నారు. శాయంపేట మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ (బాలుర)ను తహసీల్దార్ సత్యనారాయణ తనిఖీ చేశారు. ప్రిన్సిపాల్ రేవతితో మాట్లాడి వంట గది, పిల్లలు స్నానాలు చేసే ప్రదేశం, భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రౌండ్‌లో లైట్స్ పెట్టాలని కోరినట్లు చెప్పారు. సిబ్బంది నాగరాజు పాల్గొన్నారు.

**మధ్యాహ్న భోజనం పరిశీలన..**

ఎల్కతుర్తి : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని బుధవారం డీఈవో వాసంతి పరిశీలించారు. రోజు వారీగా విద్యార్థులకు అందిస్తున్న మెనూపై ఆరా తీశారు. విద్యార్థులతో మాట్లాడి బాలికలకు పలు సూచనలు చేశారు. పాఠశాలకు సంబంధించిన పలు రికార్డులను తనిఖీ చేసి వివిధ అంశాలపై ఉపాధ్యాయులతో మాట్లాడారు. పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. ఎంఈవో సత్యనారాయణ, ప్రిన్సిపాల్ శ్రీధర్, ముల్కనూర్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రహమాన్, హెల్త్ క్యాంప్ నోడల్ ఆఫీసర్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఐనవోలు : కేజీబీవీలో అన్నాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో రమేశ్ రాథోడ్